## క్లుప్తంగా

### నమో శివరుద్రాయ



సింహాచలం: అడవివరం దరి విజినిగిరి పాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు హర నామ స్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.

### ఘనంగా తిరునక్షత్ర పూజలు



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా పెందుర్తి వెంకటాద్రిపై సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహార్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో శ్రీసూక్త హవనం,సుదర్శన హోమం, పూర్ణాహుతి జరిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు అమ్మవారి పసుపు-కుంకుమ, వస్త్రం, ప్రసాదం అందించారు.

### కార్పొరేటర్ బల్ల శ్రీనుకు పరామర్శ



కార్పొరేటర్ శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సోమవారం పరామర్శించారు. నగరంలోని ఆస్పత్రిలో ఉన్న శ్రీనివాసరావును కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరామ్, పార్టీ నేతలు గండి రవికుమార్, కోడిగుడ్ల దేవిసాంబ తదితరులు ఉన్నారు.

### పశువుల పాక, గడ్డివాము దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లిలో వనం శ్రీరామ్ అనే రైతుకు చెందిన పశువుల పాకకు సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో దగ్ధమైంది. స్థానికులు గమనించి పాకలో ఉన్న పశువులను బయటకు పంపించడంతో పెనుప్రమాదం తప్పింది. మంటలు వ్యాపించి పశువుల పాకకు ఆనుకుని ఉన్న గడ్డివాము కూడా కాలిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపు చేశారు.ఈ ప్రమాదంలో ఒక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ప్రమాదంలో నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతు శ్రీరామ్ కోరారు.

### ఎన్నికల నియమావళి పాటించాల్సిందే..

- 400 మంది బైండోవర్
- సీఐ పిన్నింటి రమణ



సబ్బవరం: ఎన్నికల నియమావళికి లోబడే రాజకీయపార్టీలు తమ కార్యకలాపాలు కొనసాగించాలని సీఐ పిన్నింటి రమణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పలు వివరాలు వెల్లడించారు. మండలంలో 400 మంది వరకూ బైండోవర్ చేశామన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అవసమైతే మరింత మందిని బైండోవర్ చేస్తామన్నారు.గ్రామాల్లో నిర్వహించే సభలు, మైక్,లౌడ్ స్పీకర్లతో పాటు ఎన్నికల ప్రచారాలకు ఆర్‌వో లేదా ఏఈఆర్‌వోల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. మండలంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టుతో సహా ముఖ్యమైన ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.



# పల్లెల్లో ఆధ్యాత్మిక సందడి

- నేడు నాలుగు గ్రామాల్లో అమ్మవార్ల పండగలు
- 14 గ్రామాల ఇలవేల్పుగా ముత్యమాంబ
- ముస్తాబైన ఆలయాలు



పరవాడలో కొలువైన పైడిమాంబ అమ్మవారు



ముత్యాలమ్మపాలెంలో కొలువుదీరిన ముత్యమాంబ



తానాంలో కొలువైన పరదేశిమాంబ అమ్మవారు



విద్యుత్ దీపాలతో అలంకరించిన ముత్యమాంబ ఆలయం

పరవాడ: మండలంలోని పలు గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. గ్రామ దేవతల పండగలను పురస్కరించుకుని ప్రతి వీధిని విద్యుత్ కాంతులతో అలంకరించారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకోవడానికి వీలుగా ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**14 గ్రామాల ఇలవేల్పు ముత్యమాంబ**

వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాలతో పాటు 14 గ్రామాల ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే ముత్యమాంబ పండగను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ తోరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వేకువ జామున 3 గంటల నుంచి అమ్మవారిని దర్శించుకొని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల కోసం బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారిని డప్పువాయిద్యాల నడుమ ఆలయానికి తోడ్కొని వస్తారు. అనంతరం భారీ బాణ సంచా కాల్పుల నడుమ అనుపు మహోత్సవం నిర్వహిస్తారు. రాత్రికి డ్యాన్సు బేబీ డాన్స్, బుర్రకథ, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ తెలిపింది.

**పరవాడలో..**

పరవాడలో వెలసిన పైడిమాంబ అమ్మవారి పండగను పురస్కరించుకొని ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునే భక్తుల కోసం ఆలయం వద్ద ప్రత్యేకంగా షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. పండగ సందర్భంగా రెండు రోజుల నుంచి గ్రామంలో కోలాట పోటీలు, పంచరత్నములు, కనకదుర్గ మహాత్యం, మెగాడాన్స్ మస్తీ, స్టార్‌నైట్స్, మెగా డ్యాన్స్ షో, డ్యాన్స్ మజాకా, డ్యాన్స్ బేబీ డాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఉచిత మజ్జిగ, మంచినీరు, ప్రసాదం అందించనున్నట్టు సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు చెప్పారు.

**తానాంలో..**

తానాం గ్రామంలో కొలువుదీరిన పరదేశిమాంబ ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. వీధులను విద్యుత్ తోరణాలతో ముస్తాబు చేశారు. మంగళవారం వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకొనే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. రాత్రికి అమ్మవారిని డప్పు వాయిద్యాలతో ఊరేగింపు జరిపి అనుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రికి డాన్స్ మస్తీ, డ్యాన్సు రాజా డ్యాన్సు, డాన్స్ బేబీ డాన్సు, డాన్స్ ధమాకా, సినీ డూప్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అలాగే మండల స్థాయిలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని సర్పంచ్ కన్నూరి దేవివెంకటరమణ తెలిపారు.

**దేశపాత్రునిపాలెంలో..**

దేశపాత్రునిపాలెంలో పోలమాంబ అమ్మవారి పండగ నేపథ్యంలో ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వీలుగా ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పందూరి వెంకటరమణ చెప్పారు.



తానాం పరదేశిమాంబ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు



విద్యుత్ కాంతుల్లో దేశపాత్రునిపాలెం పోలమాంబ ఆలయం



పరవాడ పైడిమాంబ ఆలయం వద్ద భక్తులకు ఏర్పాటు చేసిన షామియానాలు

# బడుగు బలహీన వర్గాలకు అండగా సీఎం జగన్

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. 85 వార్డు పరిధిలో తాడి, లంకెలపాలెం, మంత్రిపాలెం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని ప్రజలకు వివరించి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి అంతా సిద్ధం కావాలని సూచించారు. సంక్షేమ పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు సీఎం ఏ విధంగా అండగా ఉన్నారో వివరించి వారంతా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా చైతన్యం నింపాలని కోరారు. సమావేశంలో పార్టీ నేతలు గండి రవికుమార్, ఇల్లపు ప్రసాద్, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, రమణమూర్తి, సుందరపు అప్పారావు, నదియా, నరిసింగ్, ప్రకాష్, సురేష్, గొన్న హేమచంద్రనాయుడు, సంతోష్, గీత, వెంకటరావు, తాడి, మంత్రిపాలెం, సాలాపువాని పాలెం, లంకెలపాలెం గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు సంపూర్ణ మద్దతు



పార్టీలో చేరిన నూర్ బాషా దూదేకుల ముస్లిం సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రకటించిన నూర్ బాషా దూదేకుల ముస్లిం సేవా సంఘం

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలోని నూర్ బాషా దూదేకుల ముస్లిం సేవా సంఘం నుంచి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆ సంఘం ప్రతినిధులు ప్రకటించారు. సోమవారం పెందుర్తిలో జరిగిన కార్యక్రమంలో దాదాపు 20 మంది సంఘ సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో సేవలందించారన్నారు. ముఖ్యంగా మైనార్టీలకు పూర్తిస్థాయిలో ఆదుకున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌కు రానున్న ఎన్నికల్లో తమ పూర్తిస్థాయి మద్దతు ఉంటుందని.. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గెలుపునకు తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ముస్లింలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్, సంఘం ప్రతినిధులు షేక్ ఖాన్ సాహెబ్, బాబ్జి, షేక్ అబ్దుల్లా మాస్టర్, పీర్ సాహెబ్, రెహమాన్, సయ్యద్, ఫాతిమా బిబి, సలీమా, ఖాన్ బేబి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# అడవివరంలో వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న ఈవో శ్రీనివాసమూర్తి, వైదికులు, ఉద్యోగులు



అడవివరం పురవీధుల్లో కోలాటం ఆడుతున్న మహిళలు

- నృసింహ యజ్ఞంలో భాగస్వాములు కావాలని ఆహ్వానం

సింహాచలం: సింహగిరిపై వచ్చేనెల 1వ తేదీ వరకు సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహించనున్నారు. ఈ యజ్ఞంలో పాల్గొనాలని అడవివరం గ్రామస్తులకు స్వాగతం పలుకుతూ సోమవారం సింహాచలం దేవస్థానం వైదికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపం వద్ద యాత్రను ఈవో శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. రాజవీధి, బ్రాహ్మణవీధి, మధ్యవీధి, పోస్టాఫీసు వీధుల మీదుగా సాగింది. దేవస్థానం ఉద్యోగులు నృసింహ యజ్ఞం కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు నరసింహరాజు, నరసింగరావు, సూపరింటెండెంట్‌లు నాయుడు, ప్రసన్న పాల్గొన్నారు.

### జోరుగా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం



లండగరువులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సింహాచలం: బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీకి ప్రజలంతా అండగా నిలవాలని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు కోరారు. అడవివరం దరి లండగరువులో సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో పాటు భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, మజ్జి ధర్మా, లండ శ్రీను, లండ వెంకటరమణ,లండ భాస్కర్, ఎన్ అప్పారావు, తెడ్లపు మహేష్, పాలూరి సూరిబాబు, రచ్చ వర్మ,దమ్ము ఎర్రాజీరావు, లండ రమేష్, లండ సూరిబాబు, లండ కొండ, లండ పైడినాయుడు, మజ్జి అప్పలరమణ తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని సన్నిధిలో పౌర్ణమి పూజలు





పూజలందుకున్న సత్యనారాయణస్వామి, పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: పాల్గున పౌర్ణమి పురస్కరించుకుని సాధు మఠం వద్ద ఉన్న రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీకృష్ణ శర్మ, రాజా ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి అలంకరణ చేశారు. అనంతరం అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

# హోలీ జోష్



ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటున్న న్యాయ విద్యార్థులు



అడవివరంలో రంగులు జల్లుకుంటున్న చిన్నారులు

సబ్బవరం: రంగుల వేడుక హోలీ పండగను యువత ఉత్సాహంగా జరుపుకున్నారు. యువత ఫుల్ జోష్‌తో కేరింతలు కొడుతూ రంగుల్లో తడిసి ముద్దయ్యారు. తెల్లవారు నుంచే రంగులు పట్టుకొని రోడ్డెక్కిన యువత తెలిసిన వారికి, బంధువులకు, స్నేహితులకు రంగులు పూసి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు తినిపించుకున్నారు.చిన్నారులు, యువకులు ఎంతో ఉత్సాహంగా రంగులు జల్లుకొని, కోడిగుడ్లు, టమాటాలతో కొట్టుకొని ఉల్లాసంగా గడిపారు.

- సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒకరికి ఒకరు రంగులు పూసుకుంటూ ఆనందగా కనిపించారు.

**అడవివరంలో..**

సింహాచలం: జీవీఎంసీ 93,98వ వార్డుల్లో హోలీ పండగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువత ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని సందడి చేశారు. అడవివరం, సింహపురికాలనీ, శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం తదితర ప్రాంతాల్లో యువత కేరింతలు కొడుతూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

### కోలాటం పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: పరవాడలో పైడిమాంబ పండగ సందర్భంగా భాగంగా ఆదివారం నిర్వహించిన కోలాటం పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల అనంతరం విజేతలకు పెద్దలు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన బంగారమ్మపురం జట్టుకు రూ.15 వేలు ద్వితీయ బహుమతి కింద శ్రీరామపట్నం జట్టుకు రూ.12వేలు, తృతీయ స్థానంలో నిలిచిన మొగలిపురం జట్టు రూ.9వేలు, నాలుగో బహుమతిగా లక్కవరం జట్టుకు రూ.6000, ఐదో బహుమతి కింద జుత్తాడ జట్టుకు రూ.3000 నగదును సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు అందజేశారు. కార్యక్రమంలో చుక్క రాము నాయుడు, బండారు రామారావు, రెడ్డి శ్రీనివాసరావు, అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్పస్వామికి విశేష పూజలు



భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న శ్రీసాయిదుర్గ పీఠం సభ్యులు, సీఐ రమణ

పెందుర్తి: అయ్యప్పస్వామి జన్మదినం పురస్కరించుకుని సుజాతనగర్‌లోని శ్రీపూర్ణ పుష్కళ సమేత ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. వేకువజామున సుప్రభాత సేవ, గణపతి హోమం చేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త, గురుస్వామి వాకా చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా షోడపచార పూజలు, నవద్రవ్యాలతో అభిషేక క్రతువు జరిపారు. అయ్యప్పకు విశేష అలంకరణ చేసి అష్టోత్తర పూజలు చేశారు. ఏక హారతి, పంచ హారతి, నక్షత్ర హారతి అందించారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరులో భక్తులు అయ్యప్పకు అభిషేకాలు జరిపారు.



కోనేరులో అయ్యప్పస్వామికి అభిషేకాలు చేస్తున్న ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి

**సబ్బవరంలో ...**

సబ్బవరం: స్థానిక మూడు రోడ్ల కూడలిలో అయ్యప్పస్వామి జయంతి వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిదుర్గ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పీఠం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ,మజ్జిగప్యాకెట్లు పంపిణీ చేశారు.సీఐ పిన్నింటి రమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబు ప్రత్యేక పూజలు చేశారు. 19 ఏళ్ల నుంచి ఈ పూజలు నిర్వహిస్తున్నట్టు భక్త బృందం సభ్యులు ద్వారపూడి శ్రీను,చిత్రాడ శ్రీను తెలిపారు. కార్యక్రమంలో లగుడు మురళి, గెద్దం మోహన్ కుమార్,సుబ్రహ్మణ్యం,ఈశ్వరరావు,పండూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ బ్యాడ్మింటన్ పోటీలో లింగేశ్వరరావుకు బంగారు పతకాలు



గోల్డ్ మెడల్స్, షీల్డులతో లింగేశ్వరరావు

ఉక్కునగరం: జాతీయ మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బీవీఎస్‌కే లింగేశ్వరరావు రెండు బంగారు పతకాలు సాధించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో హర్యానా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోనెక్స్ - సన్‌రైజ్ 46వ ఇండియన్ మాస్టర్స్ జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 23 వరకు జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 27 రాష్ట్రాలకు చెందిన 1,780 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. లింగేశ్వరరావు డబుల్స్ 55+ కేటగిరీలో చెన్నైకు చెందిన డాక్టర్ మారన్ తంగవేలుతో పోటీ పడి బంగారు పతకం సాధించారు. అదే విధంగా 55+ మిక్స్‌డ్ కేటగిరీలో పూణేకు చెందిన రాజశ్రీ భావేతో పాల్గొని మరో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు బంగారు పతకాలు సాధించిన ఏకైక క్రీడాకారుడు లింగేశ్వరరావు కావడం గమనార్హం.

# వ్యర్థ రసాయనాలకు నిప్పు



వ్యర్థాల నుంచి ఎగసిపడుతున్న దట్టమైన పొగ

పరవాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని చెత్త కేంద్రం వద్ద ఫార్మా రసాయనిక వ్యర్థాలకు సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో దట్టమైన పొగ వెలువడడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. వ్యర్థాలను తరచూ వాహనాలపై తీసుకువచ్చి ఇక్కడ డంప్ చేసి వాటికి నిప్పు పెట్టడడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఫార్మా పరిశ్రమల నుంచి చాటుమాటుగా రసాయనాలు తీసుకువచ్చి డంప్ చేస్తున్న వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రసాయనాలను డంప్ చేస్తున్న వారిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు , పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.